


రూ.లక్ష విరాళం

మోపిదేవి: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించే నిత్యన్నదానానికి బందరుకు చెందిన భక్తుడు డాక్టర్ ఎల్. రాహుల్ రూ.1,00,116 విరాళం సమర్పించారు.



వేంకటేశ్వర ఆలయంలో పూజలు

మాచర్ల: పట్టణంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయాలలో శనివారం దేవాలయాల అర్చకుల కమిటీ సభ్యుల సహకారంతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 504.20 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

సీఎం పర్యటన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సమీక్ష



నగరంపాలెం: జూలై ఒకటో తేదీన తాడేపల్లి మండలం పెనుమాకలో జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి సీఎం నారా చంద్రబాబునాయుడు హాజరవుతారని, అధికారులు అందరూ సమన్వయంతో విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. సీఎం చంద్రబాబునాయుడు పర్యటన ఏర్పాట్లపై శనివారం రాత్రి కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో జేసీ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, డీఆర్‌ఓ పెద్ది రోజా, అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు ఉదయం ఆరు గంటలకు కార్యక్రమంలో పాల్గొంటారని అన్నారు. అనంతరం జరిగే ప్రజా వేదిక కార్యక్రమంలో లబ్ధిదారులు, ప్రజలతో ముఖాముఖిగా మాట్లాడతారని అన్నారు. కార్యక్రమంలో పాల్గొనే ప్రజలకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీరు అందుబాటులో ఉంచాలని, పారిశుద్ధ్య ఏర్పాట్లను పర్యవేక్షించాలన్నారు. పోలీస్ శాఖ బందోబస్తు ఏర్పాట్లు, ఆర్‌అండ్‌బీ అధికారులు బారికేడ్ ఏర్పాట్లను చేపట్టాలని సూచించారు. ఆర్‌డీఓ పి.శ్రీకర్, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, సీపీఓ శేషశ్రీ, డీఈఓ శైలజ, డీఎస్‌ఓ కోమలి పద్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన బోధన చేయాలి



పెనమలూరు: విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యాబోధన చేయాలని కృష్ణా జిల్లా విద్యాశాఖ అధికారి తాహేరా సుల్తానా సూచించారు. పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, ఏలూరు జిల్లాల ఉపాధ్యాయులకు నిర్వహించిన అటల్ టింకరింగ్ శిక్షణ తరగతుల్లో ఆమె పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్‌తో ఉపాధ్యాయులు సాంకేతికతపై అవగాహన కల్పించుకుని విద్యార్థులకు ఉత్తమ బోధన చేయాలని సూచించారు. బోధనలో సాంకేతికత అంశాలను జోడించి విద్యార్థుల్లో ఆసక్తి పెంచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్టేట్ నోడల్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, డీఎస్‌ఓ జాకీర్‌అహ్మద్, స్టేట్ హబ్ ఇన్‌చార్జి డి.వి.సుబ్బారావు, హెచ్‌ఎం వై.దుర్గాభవాని పాల్గొన్నారు. అటల్ టింకరింగ్ శిక్షణ శనివారంతో ముగిసింది.

ఐటీఐ రెండో విడత కౌన్సెలింగ్

తెనాలిఅర్బన్: జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలలో మిగిలిన సీట్ల భర్తీ కోసం రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా కన్వీనర్, ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రావి చిన్న వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 24 లోపు iti.ap.gov.in వెబ్‌సైట్‌లో తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. అలాగే అదేరోజు తెనాలి, గుంటూరులలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లోని నమోదు కేంద్రాల్లో తమ సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. జూలై 27, 28 తేదీలలో ఉదయం 9గంటల నుంచి కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. వివరాలకు 93477 95839, 63045 72793 నంబర్లలో సంప్రదించాలన్నారు.

దుర్గమ్మకు కళాకారుల నృత్య నీరాజనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు బెంగళూరుకు చెందిన పలువురు కళాకారులు నృత్య నీరాజనాలను అర్పించారు. వైష్ణవి నాట్యశాల ట్రస్ట్‌కు చెందిన పలువురు చిన్నారులు అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై భరతనాట్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం కళావేదికపై చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్యం భక్తులను కట్టి పడేసింది. పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో చిన్నారులు నృత్య ప్రదర్శన ఇచ్చారు. నృత్య ప్రదర్శన అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలు అందజేశారు.

మెరుగైన వైద్యసేవలకు కృషి

- కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని
- జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలతో కలిసి గుంటూరు జీజీహెచ్‌లో పర్యటన
- రెండు, మూడు నెలల్లో సమస్యలు పరిష్కరిస్తామని హామీ



జీజీహెచ్‌ను పరిశీలిస్తున్న కేంద్ర సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, చిత్రంలో కలెక్టర్, ఎమ్మెల్యేలు

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలను అందించేందుకు అవసరమైన అన్నిచర్యలు తీసుకుంటామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. శనివారం గుంటూరు జీజీహెచ్‌లో కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, శాసనసభ్యులు మహ్మద్ నజీర్, గళ్ల మాధవి, బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణ కుమార్‌తో కలసి పర్యటించారు.

ప్రతి వారం ఒక శాఖపై సమీక్ష..

కేంద్ర మంత్రి పెమ్మసాని మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో ప్రతి వారం ఒక శాఖ పై సమీక్షించటం జరుగుతుందన్నారు. ఆసుపత్రిలో ఏసీలు, లిఫ్టులు పనిచేయక పోవటం, రోగులు ల్యాబ్ టెస్టుల కోసం గంటల తరబడి వేచి ఉండటం , బయట ల్యాబ్‌లకు రిఫర్ చేయటం, పార్కింగ్, శానిటేషన్ సమస్యలు, రోగులకు డైట్, కొత్త బిల్డింగ్‌ల నిర్మాణ పనులు, అందులో కావాల్సిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రోగులకు సపోర్టింగ్ స్టాఫ్ తదితర సమస్యలను గుర్తించటం జరిగిందన్నారు. ఆసుపత్రిలోని సమస్యలన్నింటినీ రెండు మూడు నెలల్లో పరిష్కరించేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించటం జరుగుతుందన్నారు.

ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఏర్పాటు : జిల్లా కలెక్టర్

జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి మాట్లాడుతూ నూతనంగా వచ్చిన శాసనసభ్యులతోను అధికారులతో ఆసుపత్రి అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసి ఆసుపత్రి నిర్వహణకు సంబంధించిన సమస్యలను సరిచేసి రోగులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఆసుపత్రికి కావాల్సిన వైద్యపరికరాలు, శాశ్వతంగా ఏర్పాటు చేయాల్సిన భవనాలు, వైద్య విభాగాల విస్తరణకు సంబంధించిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని చెప్పారు.

- గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్ అహ్మద్ మాట్లాడుతూ ఆసుపత్రిలో ఉన్న సమస్యలను పూర్తిగా అవగాహన చేసుకొని వాటిని పరిష్కరించేందుకు ముఖ్యంగా రోగులకు అందించే ఆహారం నుంచి అత్యవసర విభాగంలో వైద్యులు, వైద్యపరికరాలు తదితర అన్ని అంశాలపై చర్చించటం జరిగిందన్నారు.
- పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ కేంద్ర మంత్రి ఆదేశాల ప్రకారం సత్వరమే సమస్యల పరిష్కారానికి కమిటీ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.
- ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ ఆసుపత్రికి రోజు రోజుకు రోగులు పెరుగుతుండటంతో వారికి అనుగుణంగా వైద్యులు, స్టాఫ్ నర్స్ లతో పాటు ఎఫ్ఎన్‌ఓ, ఎంఎన్‌ఓ కొరత ఉందన్నారు.
- తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ నాట్కో ట్రస్ట్, జింకానా ట్రస్ట్ ఇతర సేవా సంస్థలను కో–ఆర్డినేట్ చేసి వారిచ్చిన మౌలిక సౌకర్యాలను వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీటీకే రెడ్డి, ఆర్‌జేడీ సీహెచ్ సుధారాణి, సీఎస్ ఆర్ఎంఓ డా.బీవీ సతీష్ కుమార్, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ శ్రీధర్, ఏడీ సీహెచ్ నాగేశ్వరరావు, జింకాన కో–ఆర్డినేటర్ డాక్టర్ బాలభాస్కర్, నాట్కో ట్రస్ట్ కో–ఆర్డినేటర్ వై.అశోక్ పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ లోక్‌అదాలత్

- 1454 కేసులు పరిష్కారం
- బాధితులకు రూ.38.24కోట్లు అందజేత



లోక్ అదాలత్‌ను పర్యవేక్షిస్తున్న ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి, చిత్రంలో సంస్థ కార్యదర్శి లీలావతి

నగరంపాలెం: జిల్లాలోని అన్ని కోర్టుల ప్రాంగణాల్లో శనివారం జాతీయ లోక్‌అదాలత్ జరిగింది. ఏపీ న్యాయ సేవాధికార సంస్థ (అమరావతి) ఆదేశాల మేరకు జిల్లా అంతటా లోక్ అదాలత్ బెంచీలను అందుబాటులోకి తీసుకువచ్చిన విషయం విధితమే. గుంటూరు నగరంపాలెంలోని జిల్లా కోర్టులో జరిగిన లోక్ అదాలత్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) టి.లీలావతి పర్యవేక్షించారు. పలు న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న రాజీ పడే కేసులను పరిష్కరించారు. అందులో సివిల్ కేసులు–166, క్రిమినల్ కేసులు–708, చెక్‌బౌన్స్ కేసులు– 202, మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు–152, వివాహ సంబంధ కేసులు– 80, బ్యాంక్ కేసులు– 6, ప్రీ లిటిగేషన్ కేసులు–140 మొత్తం 1,454 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. ఆయా కేసుల విలువ రూ.38,24,12,474 అని పేర్కొన్నారు. ఫిజికల్, వర్చ్యువల్ పద్ధతిలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహణకు సహకరించిన న్యాయవాదులు, పోలీస్ శాఖ, ప్రభుత్వ శాఖలు, కక్షిదారులు, బ్యాంక్‌లు, న్యాయ సిబ్బందికి న్యాయ సేవాధికార సంస్థ ధన్యవాదాలు తెలిపింది.

మంగళగిరిలో 80 కేసులు పరిష్కారం..

మంగళగిరి: పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో 80 కేసులు పరిష్కారం కాగా రూ.48,89,000 బాధితులకు అందజేశారు. వీటిలో ఎన్ఐజే బ్యాంకులకు సంబంధించి 28 కేసులు పరిష్కారం కాగా రూ.11,40,000 చెల్లించారు. సివిల్ 5 కేసులు, క్రిమినల్ 70 కేసులు, డీవీసీ 2, ఎంసీ 2, ఎన్ఐ యాక్ట్ 8 కేసులు పరిష్కారమయ్యాయి. ఎంసీ కేసులకు సంబంధించి రూ.3,65,000, ఎన్ఐ యాక్ట్‌కు సంబంధించి రూ.20,15,000, పీఎల్‌సీ కేసులకు రూ.13,69,000 కలిసి మొత్తం రూ.48,89,000 చెల్లింపులు జరిగాయి. కేసులను సీనియర్ సివిల్ జడ్జి వై.నాగరాజ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్‌వీ రామకృష్ణ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె.సురేష్ బాబు, బార్ అసోషియేషన్ అధ్యక్షుడు బాల మురళీకృష్ణ, న్యాయవాదులు ఎ.రామ్మోహన్‌రెడ్డి, వి.భారతీదేవిలతో పాటు న్యాయవాదులు పాల్గొన్నారు.



లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు

మత్స్య సహకార సంఘాలను బలోపేతం చేస్తాం

జిల్లా మత్స్యశాఖ అధికారి గాలిదేముడు

కొరిటిపాడు(గుంటూరు): పీఎం మత్స్య సంపద యోజన పథకం ద్వారా జాతీయ సహకార అభివృద్ధి సంస్థ సహకారంతో చేపల రైతుల ఉత్పత్తిదారుల సమాఖ్యలు(ఎఫ్ఎఫ్‌పీఓ)గా రూపాంతరం చేసి తద్వారా వ్యాపార కార్యకలాపాలను బలోపేతం చేస్తామని జిల్లా మత్స్యశాఖ అధికారి పి.గాలిదేముడు స్పష్టం చేశారు. కలెక్టరేట్ ఆవరణలోని మత్స్యశాఖ భవన్‌లో జిల్లాలోని ఏడు మత్స్య సహకార సంఘాలకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గాలిదేముడు మాట్లాడుతూ ఎఫ్ఎఫ్‌పీఓల వ్యాపార కార్యకలాపాలను మరింత విస్తరింపచేస్తామన్నారు. మేనేజ్‌మెంట్ కాస్ట్, ఈక్విటీ గ్రాంట్‌లు పొందేందుకు సమర్పించాల్సిన సంఘ తీర్మానాలు, సంఘాలు నిర్వహించే బిజినెస్‌కు సంబంధించిన యాక్షన్ ప్లాన్‌పై అవగాహన కల్పించారు. అధికారులు ఎండీ జైనుల్లా ఖాన్, ముత్యాల రామ్మోహనరావు, వేదాంత రెడ్డి, మత్స్య సహకార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్టాప్ డయేరియాకు జిల్లా ప్రజలు సహకరించండి

నరసరావుపేట: జిల్లాలో జూలై ఒకటి నుంచి ఆగస్టు 31 వరకు నిర్వహిస్తున్న స్టాప్ డయేరియా ప్రచార కార్యక్రమంలో ప్రజలు అందరూ పాల్గొని ఆరోగ్య కార్యకర్తలు ఇచ్చే సూచనలు పాటిస్తూ ఏ ఒక్కరూ డయేరియా బారిన పడకుండా సహకరించాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లత్కర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని శనివారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బి.గీతాంజలిలతో కలిసి ప్రచార పోస్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు అందరూ వ్యక్తిగత పరిశుభ్రత, రక్షిత నీరు, వేడి ఆహారం తీసుకోవాలని కోరారు.

పాలకమండలి అంటే అలుసా?



కమిషనర్ శేషన్నపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న చైర్‌పర్సన్ రాధిక

రాష్ట్రంలో అధికారం మారగానే అధికారుల పనితీరు మారింది

- మున్సిపల్ చైర్‌పర్సన్, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు
- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అధికారులను నిలదీసిన వైనం



వైఎస్సార్ సీపీ, టీడీపీ కౌన్సిలర్ల వాగ్వాదం

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో జరిగే అభివృద్ధి పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ నుంచి ముందుగా ఎందుకు అనుమతి తీసుకోవటం లేదు.. కనీసం అధికారులు వార్డులలోకి వచ్చినప్పుడయినా కౌన్సిలర్‌లకు సమాచారం ఇవ్వడం లేదు.. ఎందుకు ఇలా చేస్తున్నారు? అసలు తెనాలిలో కౌన్సిల్ ఉందా? లేదా తెలియజేయాలంటూ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ తాడిబోయిన రామయ్యలు అధికారులను నిలదీశారు. తెనాలి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన కౌన్సిల్ హాల్‌లో నిర్వహించారు.

కౌన్సిలర్ల వాగ్వాదం..

మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు పట్టణంలో పనులు చేపట్టామని, ఆ విషయాన్ని చైర్‌పర్సన్‌కు తెలియజేయటం జరిగిందని కమిషనర్ బండి శేషన్న తెలిపారు. తనకు ఎప్పుడు చెప్పారంటూ చైర్‌పర్సన్ ఆయనను నిలదీశారు. అబద్దాలు చెప్పవద్దని సూచించారు. ఇంతలో టీడీపీ కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి లేచి ఒకే అంశంపై ఎందుకు ఇంతసేపు మాట్లాడుతారని, రెండో అంశానికి వెళ్లాలని సూచించారు. దీంతో టీడీపీ, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్‌ల మధ్య కొద్దిసేపు వాగ్వివాదం జరిగింది.

మహానేత వైఎస్సార్ విగ్రహానికి 2010లోనే అనుమతులు..

అంతలో రణరంగ చౌక్ వద్ద ఉన్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద మున్సిపల్ నిధులతో ఎలా అభివృద్ధి చేస్తారని టీడీపీ కౌన్సిలర్‌లు ప్రశ్నించారు. విగ్రహానికి అనుమతులు ఉన్నాయా లేదా తెలియజేయాలని, తాము అంశంపై ఇచ్చిన డిసెంట్‌పై ఎలాంటి నిర్ణయం వచ్చిందో తెలియజేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి లేచి 2010లో అప్పటి శాసనసభ ఉపసభాపతి, నేటి మంత్రి నాదెండ్ల మనోహర్ వైఎస్సార్ విగ్రహ ఏర్పాటుకు అనుమతులు ఇచ్చారని, దానిని కొండవీటి సేవా సమితి వారు సొంత నిధులతో ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. విగ్రహం ఉన్న ప్రాంతాన్ని ఆహ్లాదకరంగా మార్చేందుకు మున్సిపాలిటీ నిధులు వెచ్చించిందని తెలిపారు. అయినా శాంతించని టీడీపీ కౌన్సిలర్‌లు గ్రామీణ ప్రాంతాలలోని అభివృద్ధి పనులకు మున్సిపల్ నిధులు ఏలా కేటాయిస్తారని వాదనకు దిగారు. ఇంతలో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య లేచి అజెండాలోని అన్ని అంశాలు ఆమోదిస్తున్నట్లు తెలిపారు. దీంతో చైర్‌పర్సన్ సమావేశాన్ని ముగించారు.

మారిన వ్యవహార శైలి

సమావేశం ప్రారంభం కాగానే అజెండాలోని మొదటి అంశాన్ని చదవటం పూర్తి కాగానే కౌన్సిలర్ రామయ్య లేచి పట్టణంలోని ప్రధాన కాల్వల పూడికతీత పనులు చేపట్టారని, పనులు పర్యవేక్షించేందుకు అధికారులు వార్డులలో పర్యటిస్తున్నారని, కానీ కౌన్సిలర్‌లకు మాత్రం సమాచారం ఇవ్వటం లేదన్నారు. రాష్ట్రంలో అధికారం మారగానే అధికారుల వ్యవహార శైలి మారిందని దుయ్యబట్టారు. ఇది మంచి పద్ధతి కాదని హితవుపలికారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయాలు వద్దు

సీపీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు

మంగళగిరి: విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సీపీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని గౌతమబుద్ధా రోడ్డులో ఉన్న చిల్లపల్లి నాగేశ్వరరావు కల్యాణ మండపంలో శనివారం అధికారులు, సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. అనంతరం మంగళగిరి, తాడేపల్లి పరిధిలో ఫీడర్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వంగిపోయిన, తుప్పుపట్టిన, దూరంగా వున్న స్తంభాల స్థానాలలో కొత్తవి ఏర్పాటు చేసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలన్నారు. ఆయనవెంట సంస్థ సాంకేతిక సంచాలకులు బి.జయభారత్ రావు, పర్యవేక్షక ఇంజినీరు డాక్టర్ పి.విజయ్‌కుమార్, ఇంజినీరు సీహెచ్ రాంబొట్లు, డీఈ, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

శుభప్రదం..లాభదాయకం

- జిల్లాలో పెరగనున్న పసుపు సాగు విస్తీర్ణం
- గతేడాది మార్కెట్లో మంచి ధరలే కారణం
- సాగు భూముల కౌలు ధరలూ అధికం
- డిమాండ్‌తో విత్తనం ధరలకూ రెక్కలు
- మద్దతు ధర ఇచ్చి ఆదుకున్న గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం



తూములూరులో విత్తనం పసుపు అమ్మకాలు



దుగ్గిరాలలో పసుపు విత్తుతున్న మహిళలు

తెనాలి: భారతీయులు శుభప్రదంగా భావించే పసుపు పంట సాగుకు జిల్లా రైతాంగం సమాయత్తమైంది. పసుపు విత్తనం సేకరణ, విత్తటంలో రైతులు బిజీగా ఉన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజనుకు పసుపు సాగు విస్తీర్ణం పెరగనుండటం విశేషం. దీంతో పంట చేల కౌలు ధరలు పెరిగాయి. మార్కెట్ డిమాండ్‌తో విత్తనం పసుపునకూ రెక్కలొచ్చాయి. గతేడాది పసుపునకు మార్కెట్ ధరలు రికార్డు స్థాయిలో ఉండటం ఈ పరిణామాలకు కారణంగా చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 13వేల ఎకరాల్లో ..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో పసుపు పంట 13 వేల ఎకరాల విస్తీర్ణంలో సాగవుతుంటుంది. ఎకరాకు 35 వేల టన్నుల వరకు దిగుబడి వస్తోంది. ఏటికేడాది ఖర్చులు పెరుగుతూ వస్తున్నాయి. ఎకరాకు కనీసం రూ.1.50 లక్షల వరకు పెట్టుబడి పెడుతున్నారు రైతులు. పంట చేతికొచ్చేసరికి మార్కెట్ మాయాజాలం నిరాశపరుస్తోంది. దీంతో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గుతూ వస్తోంది. 2023–24 సీజనులో సాధారణ విస్తీర్ణంలో సగానికి మించి కూడా పసుపు సాగు చేయలేదు.

ఈ ఏడాది అదనంగా సాగయ్యే అవకాశం..

2024–25 సీజనుకు రైతులు ముమ్మరంగా పసుపు సాగు చేపడుతున్నారు. తెనాలి వ్యవసాయ సబ్ డివిజనులోని తెనాలి, కొల్లిపర, దుగ్గిరాల మండలాల్లో గతేడాది సాగుచేసిన విస్తీర్ణానికి మించి 60–70 శాతం అదనంగా సాగయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

తూములూరు కేంద్రం..

ఖరీఫ్ వరితోపాటు రబీ పంటలకు మార్కెట్ ధరలు ఆశావహంగా ఉండటంతో ఈసారి మాగాణితో సహా మెట్టచేలకు కౌలు ధరలు పెరిగాయని తెలిసిందే. పసుపు సాగు చేలకు ఎకరా గతేడాది రూ.55 వేలుంటే, ఈసారి రూ.65–70 వరకు నగదు కౌలు ఒప్పందాలు జరిగాయి. ఇక విత్తనం పసుపునకు జిల్లాలోని కొల్లిపర మండల గ్రామం తూములూరు కేంద్రమని తెలిసిందే. ప్రస్తుత సీజనుకు తూములూరుకు 300 లారీల సేలం, మైదుకూరు రకాల పసుపు విత్తనం వచ్చింది.

భారమైనా.. ఉత్సాహంగా..

పసుపు సాగుకు ఎకరాకు ఆరు నుంచి ఏడు పుట్ల వరకు వినియోగిస్తుంటారు. ఒక్కో పుట్టుకు 225 కిలోలు. గత సీజనులో పుట్టు విత్తనం పసుపు గరిష్ఠంగా రూ.3,800 నుంచి రూ.8 వేలవరకు అమ్మకాలు జరిగాయి. ఈ సీజనులో మైదుకూరు రకం రూ.11 వేలకు పైగా, సేలం విత్తనం రూ.12 వేలకు అమ్ముతున్నారు. వీటిలో పసుపు కాయకు బాగా డిమాండ్ ఉంది. పుట్టి రూ.15 వేల నుంచి రూ.21 వేల వరకు కొనుగోళ్లు జరిగాయి.

ఆదుకున్న గత ప్రభుత్వం..

పసుపు పంటకు కొన్నేళ్లుగా మార్కెట్‌లో ధరలు పెద్దగా లేవు. క్వింటాలుకు రూ.5 వేలకు కాస్త అటూ ఇటుగానే ఉంటూ వచ్చింది. సాగుఖర్చులు పెరుగుతూ మార్కెట్ ధరలు బాగా తక్కువగా ఉండటంతో గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం క్వింటాలుకు రూ.6850 చొప్పున కొనుగోలు చేసి ఆదుకుంది. 2023 సంవత్సరంలో పసుపునకు మార్కెట్ ధరలు అనూహ్యంగా పెరిగాయి. సీజను ఆరంభంలో క్వింటాలు రూ.8 వేల ధర ఉండగా క్రమంగా పెరుగుతూ వచ్చింది. పంట చేతికొచ్చేసరికి క్వింటాలు రూ.13–16 వేల వరకు అమ్మకాలు జరిగాయి. దీంతో రైతుల్లో జోష్ పెరిగింది. నాలుగైదేళ్ల క్రితమే పసుపు సాగును ఉపసంహరించుకున్న పలువురు రైతులు మళ్లీ సాగుకు సమాయత్తం అవుతుండడం విశేషం. తూములూరు రైతు వింతా వేణుగోపాలరెడ్డి వంటి ఎందరో మళ్లీ ఈ సీజనుతో పసుపు సాగు చేయటం ఇందుకు నిదర్శనం.

అన్నదాతల అర్హతలపై ఆరా

- పీఎం కిసాన్ లబ్ధిదారుల జాబితాపై విచారణ
- జిల్లాలో పీఎం కిసాన్ లబ్ధిదారుల సంఖ్య 1.90 లక్షలు
- జిల్లాలో 15,560 మంది వివరాల పరిశీలనకు చర్యలు



లబ్ధిదారుడి ఫేస్ రికగ్నైజేషన్ తీస్తున్న వీఏఏ

సత్తెనపల్లి: జిల్లాలో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం కిసాన్) పథకం లబ్ధిదారుల జాబితా పరిశీలన, అనర్హులను గుర్తించి తొలగింపు చర్యలకు ప్రభుత్వం ఉపక్రమించింది. ఈ మేరకు లబ్ధిదారుల్లో 5 శాతం మంది వివరాలు ఆరా తీసి ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేయాలని వ్యవసాయ శాఖ అధికారులకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పరిశీలించాల్సిన రైతుల పేర్లను సైతం పంపించింది. దీంతో వ్యవసాయ శాఖ సిబ్బంది 2022–23, 2023–24 సంవత్సరాల్లో పీఎం కిసాన్ పథకం కింద లబ్ధి పొందిన లబ్ధిదారుల వివరాలను ఆరా తీస్తున్నారు. లబ్ధిదారులు భౌతికంగా ఉన్నారా? లేదా?, అనర్హులు ఎవరైనా ఉన్నారా? లేదా? తదితర వివరాలు సేకరిస్తున్నారు. లబ్ధిదారుల ఫేస్ రికగ్నైజేషన్ ఫొటో తీసి పీఎం కిసాన్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.

జిల్లాలో పీఎం కిసాన్ లబ్ధిదారుల ఇలా...

జిల్లాలో పీఎం కిసాన్ పథకానికి సంబంధించి 1,90,008 మంది లబ్ధిదారులు ఉన్నారు. వారికి కొద్ది రోజుల కిందట కేంద్ర ప్రభుత్వం రూ.38,00,16,000 రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2019 ఫిబ్రవరి నుంచి అమలు చేస్తోంది. ఏడాదికి రూ.6 వేలు చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది.

పరిశీలిస్తున్న అంశాలు..

- ఆదాయపు పన్ను కడుతున్న వారు పథకం లబ్ధి అందుకుంటున్నారా?
- భూమి లేని వారు
- ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ లబ్ధి పొందుతున్న వారు
- భూమి వివరాలు సరిపోకపోవడం
- 2019 తర్వాత భూమి రిజిస్టర్ కావడం
- ఒక కుటుంబంలో ఒక లబ్ధిదారుడు ఉంటుండగా మరొక లబ్ధిదారుడికి పథకం వర్తించడం
- ఆధార్ మనుగడలో లేకపోవడం
- ఆంధ్రప్రదేశ్ నుంచి వలస వెళ్లిపోవడం
- డూప్లికేట్ రిజిస్ట్రేషన్
- భూమి సాగు చేయకుండా స్వచ్ఛందంగా వదిలేయడం వంటి వివరాలను పరిశీలిస్తున్నారు.

క్లుప్తంగా

నూరుశాతం గ్రాస్ శాలరీ ఇప్పించరూ..

కేంద్ర సహాయమంత్రికి కాంట్రాక్టు నర్సుల సంఘం వినతి

గుంటూరు మెడికల్: రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ నర్సింగ్ అధికారులకు జీఓలతో సంబంధం లేకుండా నూరుశాతం గ్రాస్ శాలరీ ఇవ్వాలని కాంట్రాక్టు నర్సుల సంఘం నేతలు కోరారు. ఈమేరకు శనివారం గుంటూరు జీజీహెచ్‌కు విచ్చేసిన కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. కాంట్రాక్టు నర్సింగ్ అధికారులను రెగ్యులర్ చేయాలని, మేనిఫెస్టోలో పేర్కొన్నవిధంగా కాంట్రాక్ట్ నర్సింగ్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్ట్ నర్సుల సంఘం నేతలు మనీషా, దివ్య, తదితరులు ఉన్నారు.

తుళ్లూరు-1 సీఐగా మాతంగి శ్రీనివాసరావు



తాడికొండ: తుళ్లూరు-1 సీఐగా మాతంగి శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో గుంటూరు లాలాపేట సీఐగా పనిచేసి వీఆర్‌లో ఉండగా ఇక్కడ పోస్టింగ్ ఇచ్చారు. రేంజ్ ఐజీ త్రిపాఠి ఆదేశాల మేరకు ఆయన శనివారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజధాని ప్రాంతంలో శాంతి భద్రతల పరిరక్షణలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా బాధ్యతలు నిర్వర్తిస్తానని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటానన్నారు.

'అండర్-16'లో వైజాగ్ భారీ స్కోర్

- సెంచరీతో అదరగొట్టిన జె.ఈశ్వర్
- కర్నూలు జట్టుపై భారీ ఆధిక్యం సాధించిన విశాఖ జట్టు
- మంగళగిరిలో కొనసాగుతున్న ఏసీఏ అండర్-16 మల్టీడే ఇంటర్ జోనల్ పోటీలు



జె.ఈశ్వర్

మంగళగిరి: బ్యాట్స్‌మెన్ చెలరేగడంతో విశాఖపట్నం జట్టు భారీ స్కోర్ సాధించింది. మంగళగిరి తాడేపల్లి-మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అమరావతి టౌన్‌షిప్‌లోగల ఏసీఏ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ఏసీఏ అండర్-16 మల్టీడే ఇంటర్ జోనల్ పోటీలలో శనివారం విశాఖపట్నం-కర్నూలు జట్లు తలబడ్డాయి. టాస్ గెలిచిన కర్నూలు జట్టు బౌలింగ్‌కు దిగింది. తొలుత బ్యాటింగ్ చేపట్టిన విశాఖపట్నం జట్టు75.3 ఓవర్లలో 323 పరుగులు భారీ స్కోర్ చేసి ఆలౌటైంది. జట్టు బ్యాట్స్‌మెన్ జె.ఈశ్వర్ 18 ఫోర్లు, 3 సిక్స్‌లతో 144 పరుగులతో చెలరేగగా కె.గౌతమ్ 6 ఫోర్లు, 1 సిక్స్‌తో 77 పరుగులతో రాణించాడు. కర్నూలు జట్టు బౌలర్ బి.మహిత్ 5 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన కర్నూలు జట్టు 31 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 43 పరుగులు మాత్రమే చేసి కష్టాల్లో పడింది. దీంతో కర్నూలు జట్టుపై విశాఖపట్నం 219 పరుగుల భారీ ఆధిక్యం సాధించింది.

అసంఘటిత కార్మిక చట్టాలు, పథకాలపై అవగాహన



కార్మిక చట్టాలను వివరిస్తున్న అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సాయి

గుంటూరు రూరల్: అసంఘటిత కార్మిక చట్టాలు, ప్రభుత్వ పథకాలపై ఇండియన్ లేబర్ లైన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మండలంలోని పెదపలకలూరు గ్రామంలో శనివారం కార్మికులకు ఏర్పాటు చేసిన ఈ అవగాహన కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సాయి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అసంఘటిత కార్మికుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భవన

అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సాయి

నిర్మాణ కార్మికుల కార్డు, ఈ-శ్రమ కార్డులు అందజేస్తున్నాయన్నారు. వాటి ఉపయోగాలు గురించి వివరించారు. ఈ కార్మిక కార్డులు పొందేందుకు 18 సంవత్సరాలు దాటి 60 సంవత్సరాలలోపు తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ అర్హులేనని తెలిపారు. ఇండియా లేబర్ లైన్ ప్రతినిధి మాట్లాడుతూ ఇండియా లేబర్ లైన్ సంస్థ అసంఘటిత కార్మికులకోసం ఉచితంగా న్యాయ సలహాలను అందించేందుకు టోల్‌ఫ్రీ నంబర్ 18008339020 ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ నంబర్ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు పనిచేస్తుందని ప్రతి ఒక్కరూ ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చన్నారు. ఇండియన్ లేబర్ లైన్ సిబ్బంది, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

చిగుళ్ల వ్యాధిపై అవగాహన అవసరం

- ఇండియన్ సొసైటీ ఆఫ్ పెరియాడెంటాలజీ చీఫ్ సెక్రటరీ డాక్టర్ ఆశిష్ జైన్
- సిబార్ డెంటల్ కాలేజీలో చిగుళ్ల వ్యాధిపై జాతీయ సదస్సు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న చీఫ్ సెక్రటరీ డాక్టర్ ఆశిష్ జైన్, డీన్ డాక్టర్ ఎల్.కృష్ణప్రసాద్

పెదకాకాని: చిగుళ్ల వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఇండియన్ సొసైటీ ఆఫ్ పెరియాడెంటాలజీ చీఫ్ సెక్రటరీ డాక్టర్ ఆశిష్ జైన్ తెలిపారు. పెదకాకాని మండలంలోని తక్కెళ్లపాడు సిబార్ దంత వైద్య కళాశాలలో శనివారం చిగుళ్ల వ్యాధిపై జాతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సుకు కళాశాల డీన్ డాక్టర్ ఎల్.కృష్ణ ప్రసాద్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ ఆశిష్ జైన్ మాట్లాడుతూ దంత వైద్యుల పర్యవేక్షణలో చిగుళ్ల వ్యాధులపై నిరంతరం పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. నోటి శుభ్రతతోనే చిగుళ్ల వ్యాధులను దూరం చేసుకోవచ్చని సూచించారు. ప్రెసిడెంట్ ఎలెక్ట్ డాక్టర్ హెచ్.ఎస్. గ్రోవర్ మాట్లాడుతూ చిగుళ్ల వ్యాధులపై అనేక సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. కళాశాల డీన్ డాక్టర్ ఎల్.కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ తమ కళాశాలలో ఇటువంటి సదస్సులు గతంలో ఎన్నో నిర్వహించామని, భవిష్యత్తులో కూడా మరిన్ని చేపడతామన్నారు. సదస్సుకు రాష్ట్రంలోని 10 దంత వైద్య కళాశాల నుంచి పీజీ విద్యార్థులు హాజరయ్యారు. డాక్టర్ అనిల్ మేలత్, డాక్టర్ అర్పిత పాల్, ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ డి.రవీంద్రనాథ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ బి.రామనారాయణ, కళాశాల డైరెక్టర్ డాక్టర్ టి.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వి.రమణారెడ్డి, వైస్ డీన్ డాక్టర్ బి.నగేష్, ఆర్గనైజింగ్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భర్త వేధింపులతో భార్య ఆత్మహత్య

మార్టూరు: భర్త వేధింపులు భరించలేక భార్య బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలోని నాగరాజుపల్లిలో శనివారం జరిగింది. సీఐ ఎస్వీ రాజశేఖర్‌రెడ్డి వివరాల మేరకు.. పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం నాయుడుపాలెం గ్రామానికి చెందిన బోయినశెట్టి చిన్నవెంకటేశ్వర్లు తన మూడో కుమార్తె నందిని అలియాస్ నరసమ్మ (33)ను ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం ఈదర గ్రామానికి చెందిన జడ లక్ష్మీనారాయణతో 13 సంవత్సరాల కిందట వివాహం జరిపించారు. గత కొన్నేళ్లుగా నాగరాజుపల్లి గ్రామంలో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. గత ఆరు నెలలుగా లక్ష్మీనారాయణ భార్య నందినిని నిత్యం అనుమానిస్తూ శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ క్రమంలో గత శుక్రవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో భార్యాభర్తల మధ్య ఘర్షణ జరిగింది. అనంతరం భర్త ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. నిత్యం భర్త అనుమానపు వేధింపులతో మనస్తాపానికి గురైన నందిని 11 గంటల ప్రాంతంలో ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగింది. అనంతరం విషయాన్ని తన అక్క వెంకటలక్ష్మికి ఫోన్ ద్వారా తెలపడంతో ఆమె స్థానికుల్ని అప్రమత్తం చేసింది. అపస్మారక స్థితిలో ఉన్న నందినిని శుక్రవారం మధ్యాహ్నం మార్టూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం చిలకలూరిపేటకు తీసుకెళ్లగా పరిస్థితి విషమంగా మారడంతో గుంటూరుకు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నందిని పరిస్థితి విషమించడంతో శనివారం మధ్యాహ్నం మృతి చెందింది. మృతురాలి తండ్రి చిన్న వెంకటేశ్వర్లు ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

టెక్నాలజీ రైజింగ్ స్టార్ అవార్డుకు ఎంపికైన తెలుగుతేజం



కొండా హేనాదీప్తి

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు నగరానికి చెందిన కొండా హేనాదీప్తి అంతర్జాతీయ స్థాయిలో టెక్నాలజీ రైజింగ్ స్టార్ అవార్డుకు ఎంపికయ్యారు. ప్రముఖ సంస్థ అమెజాన్‌లో ఆరు లెవల్స్ స్థాయిలో కెనడాలోని టొరంటో నగరంలో పనిచేస్తున్న హేనాదీప్తి అమెజాన్‌లోనే కాకుండా ఆపిల్, గూగుల్‌తో పాటు ఆర్బీఎక్స్ అనే సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ సెంటర్స్‌లో విశేష అనుభవం గడించారు. ఈ సందర్భంగా ఆమె టెక్నాలజీ రైజింగ్ స్టార్ అవార్డుకు ఎంపికైనట్లు అమెజాన్ సీఈఓ సమాచారం పంపారు. గుంటూరు బ్రాడీపేట 6/12లో నివసిస్తున్న హేనాదీప్తి తండ్రి కొండా జస్టిన్ రాజ్ ఆంధ్ర విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తుండగా, ఆమె భర్త కళ్యాణ్ కెనడాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నారు. కాగా టెక్నాలజీ రైజింగ్ స్టార్ అవార్డు ప్రదానోత్సవం అమెరికాలో మిచిగాంగ్ రాష్ట్రంలోని డెట్రాయిట్ నగరంలో అక్టోబర్ నాలుగో తేదీన జరగనుంది. హేనాదీప్తి గతంలో ఆరున్నరేళ్లు ఇన్ఫోసిస్‌లోనూ, రెండేళ్లపాటు ఐ.గేట్, మరో ఆరేళ్లు థామ్సన్ రీయూటర్స్‌లోనూ పని చేసి, గత ఏడేళ్లుగా అమెజాన్‌లో సీనియర్ డెవలప్‌మెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా తమ పాఠశాల పూర్వ విద్యార్థిని హేనాదీప్తి అంతర్జాతీయ స్థాయిలో అవార్డుకు ఎంపిక కావడంపై బ్రాడీపేటలోని లూథరన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ కేతు ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. సాఫ్ట్‌వేర్ రంగంలో విశేష అనుభవం, నైపుణ్యం గడించిన హేనాదీప్తి గుంటూరు ఖ్యాతిని విదేశాల్లో చాటడం గర్వకారణమన్నారు.

చైన్ స్నాచర్ అరెస్ట్

- బంగారు ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ శ్రీనివాసరావు



మంగళగిరి: మహిళల మెడల్లో వరుసగా బంగారు గొలుసులు లాక్కెళ్తున్న చైన్‌స్నాచర్‌ను అరెస్ట్ చేసిన అతని వద్ద నుంచి బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు గుంటూరు జిల్లా అడిషనల్ ఏఎస్పీ(క్రైం) శ్రీనివాసరావు తెలిపారు. పట్టణ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. వ్యసనాలకు, జల్సాలకు అలవాటుపడిన విజయవాడకు చెందిన విఘ్నేష్ ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకుని వారి మెడల్లోని బంగారు చైన్‌లను లాక్కెళ్తుంటాడన్నారు. ఇటీవల మంగళగిరి, గుంటూరులలో ఇద్దరు మహిళల వద్ద చైన్‌లు తస్కరించగా బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. నిందితుడు శుక్రవారం నగర పరిధిలోని ఎన్ఆర్ఐ జంక్షన్ వద్ద ఉన్నాడనే పక్కా సమాచారంతో అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 52 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు. సమావేశంలో డీఎస్పీ రవికాంత్, సీసీఎస్ సీఐ వెంకన్న చౌదరి, పట్టణ సీఐ వినోద్ కుమార్, ఎస్ఐలు ఖాదర్ బాషా, క్రాంతి కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

దిగువ కృష్ణానదిలో గుర్తు తెలియని మృతదేహం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దిగువ కృష్ణానదిపై ఉన్న కొత్త బ్రిడ్జి 4వ ఫిల్లర్ వద్ద నీటి గుంతలో గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించినట్లు విజయపురిసౌత్ ఎస్ఐ పట్టాభిరామయ్య శనివారం తెలిపారు. సుమారు 65 నుంచి 70 సంవత్సరాల వయస్సు కలిగిన వృద్ధుడి రెండు కాళ్లు విరిగిపోయి ఉన్నాయన్నారు. మృతుడి ఒంటిపై ముదురు ఆకుపచ్చ చారలు ఉన్న లేత ఆకుపచ్చ రంగు టీ షర్ట్, నీలి రంగు, కాఫీ రంగు ఉన్న గళ్ల లుంగీ, కాఫీ రంగు కలిగి యువరాజ్ కంపెనీకి చెందిన ఫుల్ డ్రాయర్ ధరించబడి ఉన్నాయన్నారు. మెడకు తెల్లని కట్టు కట్టబడి ఉందన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అలరించిన సంగీత మహోత్సవం

ఇద్దరు సంగీత విద్వాంసులకు 'గాన విదుషి' రామకుమారి స్మారక అవార్డుల ప్రదానం



బీవీ దుర్గాభవాని, పాటిబండ్ల జానకికి అవార్డు ప్రదానం చేస్తున్న అన్నవరపు రామస్వామి, ఎం.శేషురాణి

తెనాలి: ప్రఖ్యాత సంగీత విద్వాంసురాలు 'గాన విదుషి' గద్దె వేంకట రామకుమారి నవమ వర్ధంతి సంగీత మహోత్సవం శనివారం రాత్రి ఘనంగా జరిగింది. పట్టణానికి చెందిన సంగీత సంస్థ హేమాద్రి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేటలోని రాష్ట్రప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో ఏర్పాటైన సభకు గుంటూరులోని గాయత్రి మహిళా సంగీత సన్మండలి కార్యదర్శి ఎం.శేషురాణి అధ్యక్షత వహించారు. సభలో రామకుమారి ప్రియశిష్యులు ప్రముఖ సంగీత విద్వాంసురాలు, విశ్రాంత సంగీత ఉపాధ్యాయిని పాటిబండ్ల జానకి, 'సంగీత విద్వన్మణి' బీవీ దుర్గాభవానికి రామకుమారి స్మారక అవార్డును ప్రదానం చేశారు. రామకుమారి శిష్యరికంలో సంగీత సాధనతో తన జీవితం ధన్యమైందని పాటిబండ్ల జానకి చెప్పారు. తన గురువులు రామకుమారి, 'నాద సుధార్ణవ' అన్నవరపు రామస్వామి శిష్యరికంలో తన సంగీత సాధనలోని అనుభవాలను గుర్తుచేసుకున్నారు. మరొక సత్కార గ్రహీత బీవీ దుర్గాభవాని మాట్లాడుతూ తన సంగీత విద్య, తనకు లభించిన కీర్తిప్రతిష్ఠలు గురువులు రామకుమారి, అన్నవరపు రామస్వామి పెట్టిన భిక్షగా చెప్పుకొన్నారు. గురువుల ఆదర్శంగా సంగీత ప్రచారంలో కొనసాగుతున్నానని చెప్పారు. ముందుగా అన్నవరపు రామస్వామి తన ప్రసంగంలో ఎందరో శిష్యులను తీర్చిదిద్దిన సంగీత గురువు రామకుమారి ప్రత్యేకతలను వివరించారు. తొలుత ప్రముఖ వీణ విద్వాంసురాలు పుచ్చా కనకదుర్గ వీణావాదనతో సంగీతోత్సవం ఆరంభమైంది. సభానంతరం బీవీ దుర్గాభవాని గాత్ర కచేరీ శ్రోతలను అలరించింది. వీరికి వయొలిన్‌పై హేమాద్రి చంద్రకాంత్, మృదంగంపై కేవీ రామకృష్ణ వాయిద్య సహకారం అందించారు. నిర్వాహక అకాడమీ అధ్యక్షుడు కోదండ రామశాస్త్రి, సుబ్రహ్మణ్య శాస్త్రి, రవికుమార్ పాల్గొన్నారు. అకాడమీ కార్యదర్శి వీఎల్ సుజాత పర్యవేక్షించారు.

నేడు సంగీత నృత్యోత్సవం



ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన శ్రీనివాసరావు

తెనాలి: ప్రపంచ సంగీత దినోత్సవాన్ని ఆదివారం సాయంత్రం స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటలనుంచి ఆరంభించే ఈ వేడుకలో పలు నృత్యప్రదర్శనలు, సంకీర్తన గానం ఉంటాయని నిర్వాహకులు కొండపి శ్రీనివాసరావు తెలియజేశారు. సంగీత గురువు వరుఖుల సునీత, మృదంగ విద్వాంసుడు కేవీ రామకృష్ణతో కలిసి శనివారం సాయంత్రం ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. నృత్యగురువులు పెసర్లంక వసంత దుర్గ, చల్లా యామిని శిష్యబృందంచే నృత్యాంశాలను ప్రదర్శిస్తారు. కొలిశెట్టి బాలా త్రిపుర సుందరి, చుండూరు ఆదిలక్ష్మి, సొల్లేటి శైలజ, మాదల గార్గి, కొండపి వసుంధర, కటకం అన్నపూర్ణ, ఎ.యశస్విని, గౌరవరుఖుల ఆంజనేయ శాస్త్రి, వరుఖుల లక్ష్మీసునీత, ఆకెళ్ల హిమబిందు, పెరవలి వంశీకృష్ణ బృందాలతో సంకీర్తన గానం ఉంటాయన్నారు. గన్నె శ్రీనివాసన్‌చే వేణుగానం. చివరిగా లాలిపాట గానం ఉంటాయని తెలియజేశారు. సంకీర్తన గానానికి మృదంగంపై కేవీ రామకృష్ణ, వయొలిన్‌పై చావలి శ్రీనివాస్, తబలపై పెరవలి వంశీకృష్ణ, కీబోర్డుపై సాయివాయిద్య సహకారం అందిస్తారని వివరించారు. అనంతరం గురువులకు సత్కారం ఉంటుందని తెలిపారు.

ఉద్యోగ విరమణ చేయనున్న సిబ్బందికి సత్కారం



పోలీస్ అధికారులను సత్కరించిన జిల్లా ఏఎస్పీ రమణమూర్తి

నగరంపాలెం: ప్రజా సేవ చేసేందుకు పోలీస్ శాఖ దగ్గరగా ఉంటుందని జిల్లా ఏఎస్పీ (పరిపాలన) జీవీ రమణ మూర్తి అన్నారు. జిల్లాలో 10 మంది పోలీస్ అధికారులు జూన్ 30న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ క్రమంలో ఉద్యోగవిరమణ చేయనున్న ఎస్ఐలు హనుమయ్య, వి.సత్యనారాయణ (డి.సి.ఆర్.బి), వి.సుబ్బారావు, ఎంఎస్ వెంకటేశ్వరరావు (తెనాలి కంట్రోల్ రూం), రాజారామ్ మోహన్‌రావు, జానీబాషా (ఎస్‌బీ), ఏఎస్ఐలు సీహెచ్ ఏడుకొండలు (పటా   పీఎస్), వి.విజయకుమారి (నగరంపాలెం పీఎస్), హెడ్‌కానిస్టేబుళ్లు బి.సుబ్బారావు (తుళ్లూరు ట్రాఫిక్ పీఎస్), పి.సుబ్బారావు (తుళ్లూరు ట్రాఫిక్ పీఎస్)లను శనివారం జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లోని హాల్‌లో సత్కరించారు. అనంతరం జ్ఞాపికలను అందించారు. ఈ సందర్భంగా జిల్లా ఏఎస్పీ జీవీ రమణమూర్తి మాట్లాడుతూ పోలీస్‌శాఖలో సుమారు 30 నుంచి 41 ఏళ్లు చేసిన సేవలు మరువలేమని అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన తర్వాత ఏదైనా సమస్యలు ఉన్నట్లయితే నేరుగా తమను కలవవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐలు శ్రీహరిరెడ్డి, బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.